# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలోని 14 జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమిస్తూ.. డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు.

- భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నుండి వచ్చే ఏడాది జూన్ నెలలో విమాన సర్వీసులు ప్రారంభమవుతాయని కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

- డయేరియా వల్ల ఎలాంటి మరణాలు సంభవించలేదని, ప్రజలెవరూ వదంతులు నమ్మవద్దని మంత్రి పి.నారాయణ సూచించారు.

- పరిశ్రమలు, ప్రభుత్వం రెండూ కలిసి పని చేస్తేనే అభివృద్ధి సాధ్యపడుతుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి ఎన్.యువరాజ్ తెలిపారు.

======================

రాష్ట్రంలోని పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ)ల బదిలీలకు సంబంధించి డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఈరోజు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని 14 జిల్లాలకు కొత్త అధికారులను నియమించారు. 7 జిల్లాలకు ఎస్పీలుగా కొత్త అధికారులు, మరో 7 జిల్లాలకు ఇతర జిల్లాల నుంచి ప్రభుత్వం బదిలీ చేసింది. మిగిలిన 12 జిల్లాలకు ఉన్నవారినే ఎస్పీలుగా ప్రభుత్వం కొనసాగిస్తోంది.

======================

భోగాపురం విమానాశ్రయం పనులు 86 శాతం పూర్తి అయినట్టు పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. విజయనగరం జిల్లా భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనులను కేంద్రమంత్రి ఈ రోజు పరిశీలించారు. పనుల పురోగతిపై నిర్మాణ సంస్థ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2026 జూన్ లో విమాన సర్వీసులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా ఎయిర్ పోర్టు నిర్మాణ పనులలో జాప్యం లేకుండా చూస్తున్నామని తెలిపారు. విశాఖ నుంచి అంతర్జాతీయ కనెక్టివిటీ పెంచేందుకు దృష్టి సారించామని రామ్మోహన్ నాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

=======================

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లా కలెక్టర్లు ఈరోజు బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లా కలెక్టర్ గా పి.రాజబాబు ఈ రోజు బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా కలెక్టర్ గా ఎస్.రామ సుందర్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా నూతన కలెక్టర్ తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్గా ఎన్. ప్రభాకర రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అధికారులందరూ సమన్వయంతో పని చేసి జిల్లా అభివృద్ధికి దోహదపడాలని కోరారు. గుంటూరు జిల్లా కలెక్టర్ గా ఏ. తమీమ్ అన్సారియా, బాపట్ల జిల్లా నూతన కలెక్టర్ గా డాక్టర్ వాసుదేవ వినోద్ కుమార్, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ గా కీర్తి చేకూరి ఈ రోజు బాధ్యతలు స్వీకరించారు.

=======================

పరిశ్రమలు, ప్రభుత్వం రెండూ కలిసి పని చేస్తేనే అభివృద్ధి సాధ్యపడుతుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి ఎన్.యువరాజ్ తెలిపారు. తిరుపతిలో సులభతర వాణిజ్య అవగాహన ప్రాంతీయ సదస్సును పరిశ్రమల శాఖ ఈ రోజు నిర్వహించింది. ఈ సమావేశంలో దృశ్యమాధ్యమ విధానం ద్వారా పాల్గొన్న యువరాజ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వ్యాపార అభివృద్ధికి విస్తృతమైన అవకాశాలున్నాయని తెలిపారు. నేటి సాంకేతికతను వినియోగించుకొని పరిశ్రమల స్థాపనకు యువత ముందుకు రావాలని ఆయన కోరారు.

=======================

అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడులో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 52 మంది లబ్ధిదారులకు 25 లక్షల రూపాయల విలువైన చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అనారోగ్యం, ప్రమాదాలు వంటి సందర్భాల్లో సీఎం సహాయనిధి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

విరామం

=======================

డయేరియా వల్ల ఎలాంటి మరణాలు సంభవించలేదని, ప్రజలెవరూ వదంతులు నమ్మవద్దని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. నారాయణ సూచించారు. విజయవాడ నగరంలో డయేరియా మెడికల్ క్యాంప్‌ను మంత్రి ఈరోజు పరిశీలించారు. నూతన ప్రభుత్వాసుపత్రిలో బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డయేరియా మూలాలు ఎక్కడున్నాయో కనుక్కొనేందుకు అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. నీటి పరీక్షల నివేదికలు వచ్చాక అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేస్తూ..

(వాయిస్ 28 సెకన్లు)

=======================

కేంద్ర ప్రభుత్వం వస్తు సేవల పన్ను (జీఎస్టీ) రేట్లు సవరించిన నేపథ్యంలో నిత్యావసర సరుకుల ధరలు దిగిరానున్నాయి. మధ్యతరగతి ప్రజలపై కొనుగోలు భారం తగ్గనున్నది. నిత్యం వినియోగించే వస్తువులతో పాటు ఆటోమొబైల్, టెలివిజన్ ధరలు కూడా తగ్గిస్తూ ఈనెల 3న జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు ప్రముఖ ఎఫ్ఎంసీజీ బ్రాండ్లు ఉత్పత్తుల ధరలను తగ్గిస్తున్నాయి. సవరించిన ధరలు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానున్నాయి. కొత్త స్టాక్‌కే కాకుండా ఇప్పటికే మార్కెట్‌లో ఉన్న ఉత్పత్తుల ఎమ్మార్పీని మార్చుకునే వెసులుబాటును

కేంద్రం కల్పించింది. దీంతో స్టాక్‌తో సంబంధం లేకుండా ఈ నెల 22 నుంచి సవరించిన జీఎస్టీ ప్రయోజనం వినియోగదారులకు బదిలీ కానుంది.

=======================

'సారథ్యం' బహిరంగ సభను విశాఖపట్నంలో రేపు నిర్వహించనున్నామని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తెలిపారు. విశాఖలో ఈరోజు జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... ఈ సభకు పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాతో పాటు కేంద్ర, రాష్ట్ర నేతలు హాజరవుతారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయిలో ప్రజలకు అందుతున్నాయని, విశాఖ స్టీల్ ప్లాంట్‌పై విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, వాటిని నమ్మవద్దని సూచించారు.

=======================

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ అల్పపీడనం రాగల 2 రోజుల్లో పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ దక్షిణ ఒడిసా, ఉత్తర ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా ప్రయాణించే అవకాశముందని పేర్కొంది. దీని ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజులు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన  జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముందని తెలిపింది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన గాలులు గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వెల్లడించింది.

=======================

రాజీ మార్గమే అత్యుత్తమ మార్గమని పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జ్ సయ్యద్ ముజీబ్  అన్నారు. శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తిలోని జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో ఈరోజు లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లోక్ అదాలత్ లో రాజీకి అర్హమైన క్రిమినల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి గొడవలు, కుటుంబ కలహాలు, చెక్ బౌన్స్ కేసుల వివాదాలను జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

=======================
=======================